స్వాతి వారపత్రిక, 30-1-2009

# నడవాల్సిన దారి

ఎండ కణకణలాడుతోంది. పొద్దెక్కుతున్న కొద్దీ శ్రీపతికి చిరాకు ఎక్కువవుతూ వుంటుంది. మొహం తుమ్మల్లో పొద్దుపొడిచినట్లవుతూ వుంటుంది. చిరచిరలాడుతూ వుంటాడు. పదింటికల్లా ఆఫీస్‌కి చేరుకోవాలి. అంటే తొమ్మిదింటికల్లా మోటార్ బైక్ బయటికి తీయాల్సిందే. మౌలాలీ నుంచి హైటెక్‌సిటీ చేరుకోవడం పద్మవ్యూహాన్ని ఛేదించటమే.

శ్రీపతి తన హడావిడిలో తానుండగా, తండ్రి శంకరయ్య నెమ్మదిగా గుర్తుచేశాడు. 'సెల్‌ఫోన్ బిల్లూ, క్రెడిట్ కార్డ్ బిల్లూ కట్టాలన్నావ్'.

తండ్రి వైపు 'చెప్పావా-శుభం' అన్న చూపు చూసి, డైనింగ్ టేబుల్ ముందు కూచున్నాడు శ్రీపతి. తల్లి - విశాలాక్షి టిఫిన్ పెట్టింది. దాన్ని త్వరత్వరగా ముక్కునానోటా కొట్టుకుంటున్నాడు చిరాకు శ్రీపతి.

"ఏంలేదు. రెంటికీ ఇవ్వాళే చివరి రోజన్నావ్. మరచిపోతే మళ్ళీ రెండొందలూ,

మూడొందలూ పెనాల్టీలు... అందుకని" శంకరయ్య నసుగుతూ వివరణ ఇచ్చాడు.

నిశ్చలమైన కాసారానికి చిన్న గులకరాయి చాలు. నీటిని వలయాలు తిప్పటానికి.

"సరి... సరి... మీ ఆలోచనెప్పుడూ పైసలమీదే. ఏదో నా చావు నే ఛస్తాలెండి" అంటూ లేచాడు శ్రీపతి.

మొహాన కత్తివేటుకు నెత్తురుచుక్క లేకుండాపోయింది శంకరయ్యకి. భార్య కళ్ళల్లోకి చూస్తూ వుండిపోయాడు. ఆమె ఏదో అనబోయి, ఆగిపోయి "మంచినీళ్ళు తాగి వెళ్ళు" అంది కొడుకును ఉద్దేశించి.

"ఊc... ఊ" అని విసురుగా నీళ్ళు తాగి, త్వరత్వరగా బయటికి వెళ్ళిపోయాడు శ్రీపతి.

వీధివైపు చూస్తూ కూర్చుండిపోయాడు శంకరయ్య.

"వింతగా వుంటోంది వీడి పరిస్థితి" అని తనలో తాను అనుకుంటున్నట్టు పైకే అన్నది విశాలాక్షి.

ఆగి మళ్ళీ అన్నది. "రాత్రి ఎప్పుడొస్తాడో తెలీదు. ఒక వేళాపాళా లేదు. రెండింటికి వచ్చినా నాలుగు మెతుకులు కతకటం, చిన్న గిన్నెతో పెరుగుపెట్టాలి ఆ సమయంలో కూడా. ఏం అలవాటో పాడో. అన్నీ నెట్ వైద్యాలుట. పొద్దున ఆలస్యంగా లేవడం, చిరాకు, పరుగో పరుగు. మొహమెప్పుడూ గంటు పెట్టుకునే వుంటాడు. ఆ కోపం లెక్కలు ఎవరి దగ్గరున్నాయో అర్థం కాదు. ఆ పెళ్ళాం పిల్లేమో బెంగుళూరులో ఒంటరి జీవితం.

వీడేమో ఇక్కడ. ఇదీ వరస..... ఉన్నట్టుండి వింతగా ప్రవర్తిస్తూ వుంటాడు. 'ఈ ఉద్యోగం నేను చెయ్యలేను. హాయిగా రోడ్డు పక్కన బండిపెట్టుకుని మిర్చిబజ్జీలు అమ్ముకుంటే బెటర్' అంటున్నాడు మొన్నొకరోజు....!"

విశాలాక్షి తల్లిమనసు నిట్టూర్పుని దిగమింగింది.

కొడుకు ఆలోచనతో శంకరయ్య మనసంతా అతలాకుతలంగా చేస్తోంది. "నాల్రోజుల క్రితం మన అల్లుడు ఆనందం మీద విరుచుకుపడ్డాడు, చూశాం కదా. ఎన్నేళ్ళొచ్చినా మైనర్ కుర్రాళ్ళే కొంతమంది" అని పళ్ళు కొరుకుతూ మాటల రాళ్ళు పగలకొట్టాడు.

రాజ్యం వాళ్ళాయన బాధ్యతారాహిత్యం, వ్యాపారం అంటూ మాటిమాటి

డబ్బు కోసం రావడం నిజమేననుకో - అయినా బావని పట్టుకుని ఎంత మాటంటే అంతమాట అనటమేనా? చూశావా - మళ్ళీ మరుక్షణం ఏదో కొత్త కవిత చదువుతున్న వాడిలా ఆనందాన్ని వెనకేసుకొచ్చి రాజ్యంని తిట్టాడు.

తన సంసారం తనకి పట్టదు. భర్తంటే లక్ష్యం లేదు. చీరెతో ఫాల్స్ ఫ్రీ అంటే నాలుగు చీరెలు కొనేస్తుంది.

'ముగ్గురు పిల్లల తల్లే కానీ బాధ్యత లేని మనిషి' అంటూ చెల్లెలి మీదికి గాలి మళ్ళించాడు.

లేచివెళ్ళి టేబుల్ మీది మంచినీళ్ళు తాగి, మళ్ళీ శంకరయ్యే అన్నాడు, "ఈమధ్య శ్రీపతిలో ఇట్టాంటి ద్వంద్వ ప్రవృత్తి ఎక్కువైంది" "మాట్లాడితే అదీ వరస. లేకపోతే తడిసిన నులక మంచంలా రోజుల తరబడి మాటా పలుకూ లేకుండా బిర్రబిగుసు కుంటాడు."

విశాలాక్షి తలెత్తి భర్తకేసి చూసింది. లేచి వెళ్ళి తమ టిఫిన్ సిద్ధం చేయసాగింది. అప్పటికి పదిన్నరయింది. టిఫిన్‌లయినాయి. ఎదురు అపార్ట్‌మెంట్‌లో మాటలూ, హడావిడీ గమనించి గుమ్మంలోకొచ్చి చూశాడు శంకరయ్య. ఎవరో లోన్ రికవరీ ఏజెంట్లు, దురుసుగా మాట్లాడుతున్నారు. ఆ ఇంటి యజమాని అవధాన్లుగారు తల వంచుకుని ఏదో సర్దిచెప్తున్నాడు. ముంబై నుంచి కొడుకు డబ్బు పంపితేనే ఆయనకీ, భార్యకీ భుక్తి. ఈ లోనుకీ అంతే. అతన్నుంచే డబ్బు రావాలి.

శంకరయ్యకి శ్రీపతి ఈ అపార్ట్‌మెంట్ కోసం బ్యాంక్‌లో తీసుకున్న లోన్ గుర్తుకొచ్చింది. ఇంట్లోకొచ్చి తలుపేశాడు. శ్రీపతి బ్యాంక్‌కి ఇవ్వాల్సిన పోస్ట్‌డేటెడ్ చెక్‌లను సమయానికి సరిగా అందజేయడు. ఒక్కొక్కప్పుడు బ్యాంక్ నుంచీ ఫోన్లు వస్తూ వుంటయ్. శ్రీపతికి ఈ విషయాలన్నిటా ఉదాసీనతే. పాలసీల ప్రీమియంలు చెల్లించటంలోనూ అదే తంతు. 'పోనీ ఈ వ్యవహారాలు నే చూస్తానంటే కస్సుమని లేస్తాడు.'

"మీకేం అక్కర్లేదా తలనొప్పి. నా పనులు నేను చేసుకోగలను" అని నిష్కర్షగా చెప్తాడు. కానీ, ఆఫీస్‌కి పోతే - ఒకటే బిజీ. రిలీజ్ డేట్లు, ప్రాజెక్ట్ లీడర్లతో ఘర్షణలు, క్లయింట్స్‌తో చర్చలు.... ఇవే సరిపోతాయంటాడు.

ఆలోచిస్తూ నడుంవాలిస్తే కునుకుపట్టింది.

భోజనానికి ముందు శ్రీపతికి ఫోన్ చేశాడు శంకరయ్య. హౌసింగ్ లోన్

గురించి యథాలాపంగా చెప్పాడు. శ్రీపతికి కోపమొచ్చింది. "నన్నేం తిన్నగా బతకనీయరా. దీనికా ఫోన్ రాత్రికి కనుక్కోవచ్చుగా" అని ఫోన్ పెట్టేశాడు.

శంకరయ్య మనసు చివుక్కుమంది. ఆయనకి తెలీకుండానే మొహం మిల్లిలా అయింది.

మధ్యాహ్నం రెండింటికి విశాఖ నుంచి సుందరం ఫోన్ చేశాడు. శంకరయ్య బావమరిది. చెల్లెలు శాంత భర్త. శ్రీపతికిచ్చింది వీళ్ళ పిల్ల రాణినే.

"రాణికి ఆరోగ్యం బాగుండటం లేదు. శాంత బెంగుళూరు వెళ్ళింది. వారమయింది. డాక్టర్‌కి చూపించాడు. ఏదో హడావిడిలో చెప్పలేదు" ఇదీ సారాంశం.

వినగానే శంకరయ్య, విశాలాక్షి కోడలి ఆరోగ్యం గురించి ఆందోళనపడ్డాడు. శ్రీపతైనా మాటవరసకు కూడా ఈ విషయం తమతో అనలేదే అనుకున్నారు.

వీళ్ళు మాట్లాడుకుంటూండగానే మళ్ళీ ఫోన్ వచ్చింది. ఈసారి రాణి నుంచి – "బావ సెల్‌ఫోన్ మరచిపోయి వెళ్ళాడా మామయ్యా?" అని. తాను ఫోన్ చేస్తుంటే రెస్పాన్స్ లేదట. తీసుకువెళ్ళినట్లే చెప్పాడు శంకరయ్య. ఆమె ఆరోగ్యం గురించి అడిగాడు.

"ఫర్వాలేదు. ఓకే" అన్నది. ఆ వెంటనే విశాలాక్షి మాట్లాడింది. "రేపు మళ్ళీ డాక్టర్ దగ్గర అపాయింట్‌మెంట్ వుంది, వెళ్ళాలి" అన్నది. ఫోన్ కట్ అయింది.

శంకరయ్య, విశాలాక్షి – కొడుకూ, కోడలు గురించి మాట్లాడుకుంటూ కూచున్నారు. శ్రీపతీ, రాణీ ఒకర్నొకరు ప్రేమించి పెళ్ళిచేసుకున్నారు. ఇద్దరివీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు. పెళ్ళయి ఐదేళ్ళయింది. ఇంకా సంతానం లేదు. విశాలాక్షి ఆ ప్రస్తావన తెస్తే "మా ఆలోచనలు మాకు వున్నాయి. మేమేమీ చిన్నపిల్లలం కాము. మళ్ళీ ఆ ప్రసక్తి తీసుకురాకండి" అని చెప్పారు.

పనిలేక నీడ పట్టు నుంచి జ్యేష్ఠ మాసపు ఎండలోకి వెళ్ళినట్లయింది. ఆ తర్వాత వారి మధ్య ఆ ప్రసక్తి రాలేదు.

ఆ రోజు ఆఫీస్‌లో లంచ్‌టైమ్‌లో శ్రీపతీ, విశ్వం మాట్లాడుకుంటూ కూర్చున్నారు. విశ్వం, శ్రీపతీ బిటెక్ క్లాస్‌మేట్స్. ప్రస్తుతం కొలీగ్స్. వాళ్ళ చుట్టూ చాలా మంది చేరారు. సాధారణ అభిప్రాయంగా మొదలైన సంభాషణ చర్చలోకి దిగి, వాదనలోకి నడిచి, మాటల పోరాటంలోకి దూకి, గాలివానగా పరిణమించింది.

విషయం చిన్నదే. అసంఘటిత కార్మికులు, సాఫ్ట్‌వేర్ రంగం, జీతభత్యాల్లో వ్యత్యాసాలు, దేశ రాజకీయాలు, దాన్లోనుంచీ సాంఘిక న్యాయం గట్రా దొర్లినై.

కంపెనీలు ఉద్యోగుల ట్రైనింగ్ పేరుతో వారికిచ్చే జీతాన్ని వివిధ ఖాతాల్లో తామే తీసేసుకోవడం..... ఇలా సాగింది.

ఉన్నట్టుండి శ్రీపతి ఎవర్నో ఉద్దేశించి దగుల్బాజీలు, హిపోక్రట్స్ అన్నాడు. మొహం కందగడ్డలా చేసుకుని బాగానే ఉద్రేకపడ్డాడు. కొందరు భుజాలు తడుము కున్నారు. మాటకుమాటగా దాడి జరిగింది. అతికష్టం మీద వాతావరణాన్ని చల్లబరచగలిగాడు విశ్వం.

శ్రీపతిలో ఒకనెలరోజులుగా తాను గమనిస్తున్న మార్పుని చాకచక్యంగా విశ్లేషించి,ఎంతో నచ్చజెప్పి, ఆ సాయంత్రం అతన్ని డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళాడు విశ్వం.

కేస్ టేకింగ్‌కీ, సలహాలకీ చాలా సమయం తీసుకున్నాడు డాక్టర్. రెండు రకాల టాబ్లెట్స్ మాత్రమే రాసిచ్చి ఓ నెల వాడమన్నాడు. కేస్ షీట్ ఇచ్చాడు విశ్వం చేతికి. తాను చదువుకుని శ్రీపతికిచ్చాడు విశ్వం. శ్రీపతి ఏదో ఆలోచనలో వుండగానే 'వచ్చేవారం మీ మిసెస్‌తో కలిసి రండి. మాట్లాడదాం' అన్నాడు డాక్టర్.

సెలవు తీసుకుని వచ్చేశారు.

ఆ రాత్రి చాలాసేపు 'నెట్'లోనే వున్నాడు శ్రీపతి. కేస్‌షీట్ అతని ముందే వుంది!

గంటల తర్వాత – తనకు ఎదురుగా ఏదో పెద్ద అద్దం నిటబెట్టినట్టనిపించింది శ్రీపతికి! అద్దం అతనికి అంతరంగ కథనం చెప్పినట్టు అనిపించింది.

తెల్లవారుతూనే వచ్చారు రాణి, శాంత. రాణి ఆరోగ్యం గురించి పరామర్శలతోనే చాలా సమయం గడిచింది. ఎవరికీ మనసు మనసులో లేదు. కోడలు అనారోగ్యం ఏమిటో అత్తమామలిద్దరికీ అవగతం కాలేదు. పగలంతా పాత సంగతులు, బంధుమిత్రుల గురించిన జ్ఞాపకాలతో గడిచింది. శ్రీపతి సెలవుపెట్టి ఇంట్లోనే వున్నాడు.

ఆ రోజు సాయంత్రం శ్రీపతీ, రాణీ, విశ్వం డాక్టర్ దగ్గరికి బయల్దేరారు. శాంత చెప్పింది. "రాణి రిపోర్ట్ ఇక్కడ కూడా చూపించి రెండో అభిప్రాయం తీసుకుంటారట" అని. శాంత స్వతహాగా ముక్తసరి తరహా మనిషి. అది తెలిసిన శంకరయ్య, విశాలాక్షి ఏం చెప్పాలో తెలియక ఆమెనే చూస్తూ వుండిపోయారు.

శంకరయ్య, విశాలాక్షి, శాంతల రాత్రి టిఫిన్‌లు అయిపోయాయి. శ్రీపతీ, రాణీల భోజనం డైనింగ్ టేబుల్ మీద సిద్ధం చేసి వుంచింది విశాలాక్షి.

శ్రీపతీ, రాణీ డాక్టర్ దగ్గర నుంచి వచ్చి స్నానం పూర్తి చేసి హాల్లో కూర్చున్నారు.

ఏవో మేగజైన్లు తిరగేస్తూ టీవీ చూస్తున్నారు. వాతావరణం గంభీరంగా వుంది.

చాలాసేపు కాలుగాలిన పిల్లిలా హాలంతా తిరిగి, చివరికి సోఫాలో కూర్చుని పెదవి విప్పాడు శంకరయ్య. "శ్రీ-ఇంతకీ ఏమంటారు డాక్టర్లు".

ఏదో కలనుంచీ బయటపడ్డట్లు తండ్రివైపు చూశాడు శ్రీపతి. ఆ చూపు సాధారణంగా వుండే అతని వేడిచూపులా లేదు. సౌమ్యంగా వుంది. హమ్మయ్య అనుకున్నాడు శంకరయ్య. శ్రీపతి భార్యవైపు సాలోచనగా చూశాడు.

ఆమె తల పంకించింది. శ్రీపతి లేచి 'రండి' అంటూ తన గదిలోకి కదిలాడు. అతని గొంతుకలో అభిమానం, ఆప్యాయత గౌరవం వినిపించాయి.

శంకరయ్య అతన్ని అనుసరించాడు. హాల్లో మిగిలిన ముగ్గురూ ఆ వైపు చూస్తూ వుండిపోయారు.

తను చెప్పవలసిన వివరాలన్నీ చెప్పాడు శ్రీపతి. తన రిపోర్ట్‌లూ, రాణి రిపోర్ట్‌లూ ఆయన చేతిలో పెట్టాడు. చదివాడు శంకరయ్య. తెలియని ఆందోళనతో మళ్ళీ మళ్ళీ వాటిని నిశితంగా చదువుకున్నాడు.

శ్రీపతీ, రాణీ – ఇద్దరి ఆరోగ్య సమస్యా ఒక్కటే. చిత్రంగా రెండు రిపోర్టుల్లోనూ రోగనిర్ణయం ఒక్కటే రాసి వుంది. ఆ రోగం పేరు – 'అడల్ట్ ఏడిహెచ్‌డి'

రోగ లక్షణాలు ఇలా వున్నాయి. ప్రతి చిన్నపనినీ వాయిదా వేయడం, అసహనం, అకారణ కోపం, విసుగు, చిరాకు, ఉద్రేకపడటం, ఆందోళన, తీవ్రంగా స్పందించడం, ఘర్షణకు దిగడం, ద్వంద్వ ప్రవృత్తి, ఉదాసీనత.

శంకరయ్య ఆశ్చర్యపోయాడు. 'ఏమిటిరా ఇది?' అన్నట్టు బాధగా కొడుకు వైపు చూశాడు."అదీ పరిస్థితి. రెండు మూడు నెలలు చూడాలన్నారు"

ఇంతలో వారంరోజులు ఇట్టే గడిచిపోయాయి.

రాణి తన ఉద్యోగానికి రాజీనామా చేసింది. వెంటనే హైదరాబాద్‌లో ఏదో కంపెనీకి తన సీవీ పంపింది.

ఇంకో పదిరోజుల్లో ఆమె ఉద్యోగంలో చేరింది. రాణీ శ్రీపతీ మాదాపూర్‌లో ఫ్లాట్ తీసుకుని వేరే కాపురం పెట్టారు. ఇద్దరి చిరునామా ఒక్కటయ్యింది.

వాతావరణం ప్రశాంతంగా వుంది. వెన్నెలా, కన్నతల్లి శ్రద్ధా ఎప్పుడూ చల్లగానే వుంటాయి. రాణీ శ్రీపతీ ఇప్పుడు ఒకరికొకరు కమ్మతెమ్మెరలైపోయారు. మరి ఏడిహెచ్‌డి?? అంటే అటెన్షన్ డెఫిషిట్ హైపర్యాక్టివిటీ డిజార్డర్! అది వాళ్ళ సొంత సంతకాల్లో ఇమిడిపోయింది!!